క్లుప్తంగా

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



నదీ స్నానం అనంతరం షిర్డీ సాయినాథుని ఊరేగింపుగా గుడికి తీసుకువస్తున్న భక్తులు

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలోని షిర్డీసాయి ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలు ఉదయం కాకడ హారతితో మొదలయ్యాయి. వేదమంత్రాలు, మేళతాళాలతో సాయినాథునికి నదీస్నానం, అనంతరం వేదపండితుడు సూరవరపు అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, బాబావారికి అభిషేకాలు, అఖండ దీపారాధన నిర్వహించారు. మధ్యాహ్నం మధ్యాహ్న హారతి, సాయంత్రం సంధ్యాహారతి, రాత్రి నల్లజర్ల అభయాంజనేయ భజనమండలి సభ్యుల ఆధ్వర్యంలో భజన జరిగాయి. అనంతరం సేజ్ హారతితో మొదటి రోజు కార్యక్రమాలు ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై బాబాను దర్శించుకున్నారు.

సమిశ్రగూడెంలో వాహనాల తనిఖీ

నిడదవోలు రూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. మండలంలోని సమిశ్రగూడెం శివార్లలోని ప్రధాన రహదారిపై పోలీసులు మంగళవారం ప్రతి వాహనాన్నీ తనిఖీ చేశారు. వాహనాల్లో డబ్బు తరలిస్తే అందుకు సంబంధించిన ఆధారాలు చూపాలని తహసీల్దార్ నాగభూషణం సూచించారు. ఎంపీడీఓ జీఏ ఝాన్సీ, ఎన్నికల సిబ్బంది రత్నరాజు, పోలీసులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్, ఫ్రీజర్ బహూకరణ



దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు వాటర్ కూలర్, ఫ్రీజర్ అందజేస్తున్న దాత

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామలక్ష్మమ్మ రామానాయుడు వృద్ధాశ్రమం, దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు దాతలు రూ.1.10 లక్షల విలువైన వాటర్ కూలర్, ఫ్రీజర్ విరాళంగా అందజేశారు. గోపాలపురం మండలం పెద్దాపురానికి చెందిన కర్రి సుబ్బలక్ష్మి వాటర్ కూలర్‌ను, ఆమె కుమార్తె కర్రి సోని జ్ఞాపకార్థం ఫ్రీజర్‌ను ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు కాగిత భాస్కరరావుకు మంగళవారం అందజేశారు. కర్రి సుబ్బలక్ష్మిని ఆశ్రమం తరఫున ఘనంగా సన్మానించారు.

టెన్త్ పరీక్షకు 84 మంది గైర్హాజర్

దేవరపల్లి: మండలంలోని ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం నాటి పరీక్షకు మొత్తం 1122 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 1038 మంది హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 84 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని తిరుమలదాస్ చెప్పారు. రెగ్యులర్ విద్యార్థులు 934 మందికి గాను 313 మంది, గతంలో ఫెయిలైన విద్యార్థులు 188 మందికి గాను 125 మంది పరీక్షకు హాజరైనట్టు వివరించారు. రెగ్యులర్ విద్యార్థులు 97.75 శాతం, సప్లిమెంటరీ విద్యార్థులు 92.51 శాతం పరీక్ష రాసినట్టు ఆయన చెప్పారు.

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటిపల్లి శివకుమార్, గొన్నాబత్తుల రామారావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, కాళ్ళ రాంబాబు, ఖండవిల్లి గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు



కొవ్వూరు 17వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- 17వ వార్డులో ఇంటింటా ప్రచారం

కొవ్వూరు: వివిధ సంక్షేమ పథకాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూర్చిందని, రానున్న ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాలను తెలియజేసే కరపత్రాలను ఇంటింటికీ ఆయన పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, స్థానిక వార్డు కౌన్సిలర్ రుత్తల భాస్కరరావు, కౌన్సిలర్లు కంఠమణి రమేష్, తోట లక్ష్మీప్రసన్న, నాయకులు చొప్పా అప్పలనాయుడు, సూర్ల నరేష్, చిట్టూరి అన్నవరం, పిక్కి శ్రీనివాస్, గాడి విజయ్‌రాజ్‌కుమార్, గుర్రే శరత్, ఎండీ ఆలీ, బోడ సింగి తులసి, కవల నాగేశ్వరరావు, మాసా ఆనంద్, కట్టా ఉమామహేశ్వరి, వీర్ల శ్రీహరి పద్మ, కొడమంచిలి విజయ్‌కుమార్, దాసరి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలనలో తేడాను గుర్తించండి

- నిడదవోలు ఎమ్మెల్యే కుమారుడు వరుణ్ సాయి
- కొత్తపల్లి అగ్రహారంలో గడప గడపకూ..



గ్రామంలోని ఓ కుటుంబానికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కుమారుడు వరుణ్ సాయి

పెరవలి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత ఐదేళ్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడి కుమారుడు వరుణ్ సాయి అన్నారు. మండలంలోని కొత్తపల్లి అగ్రహారంలో వరుణ్‌సాయి మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆయన గ్రామంలో ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా వరుణ్‌సాయి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వానికి, ప్రస్తుత జగన్ ప్రభుత్వానికి తేడాను గుర్తించాలని ప్రజలను కోరారు. వలంటీర్ల ద్వారా సంక్షేమాన్ని మన ఇంటికే పంపించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని ఆయనన్నారు. అలాంటి వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించాలని కోరారు. గత ఐదేళ్లలో రూ.2 వేల కోట్లతో నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ సందర్భంగా వరుణ్‌సాయి ఇంటింటికీ వెళ్లి 'పింఛన్ వస్తోందా?, రైతు భరోసా సాయం అందిందా?, సంక్షేమ పథకాలు అందుతున్నాయా?' అంటూ వివిధ వర్గాల ప్రజలను అడిగారు. వారి దీవెనలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నక్కా పాలేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలా వెంకటేశ్వరరావు, పిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా అమ్మవార్ల జాతర



కట్లమ్మ, దండుగంగమ్మ వార్ల జాతర ఊరేగింపులో గరగ నృత్యాల సందడి

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన కట్లమ్మ, దండు గంగమ్మవార్ల జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ గ్రామ వీధుల్లో భారీ ఎత్తున గరగల ఊరేగింపు జరిగింది. వందలాది భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొనడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, కరీంనగర్ తీన్‌మార్ డప్పు వాయిద్యాలు యువతను ఉర్రూతలూగించాయి. నృత్యాలతో యువకులు సందడి చేశారు. అమ్మవారి ప్రతిరూపంగా గరగలకు మహిళలు పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు సమర్పించారు. ఆసాదుల నృత్యాలతో గ్రామ యువకులు కాలు కదిపారు. పూలతో రూపొందించిన అమ్మవారి ప్రతిరూపం ఆకట్టుకుంది.

టీడీపీ నేతలు వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత డిమాండ్



తానేటి వనిత



తలారి వెంకట్రావు

దేవరపల్లి: చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లను టెర్రరిస్టుల్లా పనిచేస్తున్నారని టీడీపీ నాయకులు అనడం బాధాకరమని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. యర్నగూడెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు ప్రజలకు స్వచ్ఛందంగా చేస్తున్న సేవ టీడీపీ నాయకులకు టెర్రరిజంలా కనిపిస్తోందా? అని ఆమె ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని ఆమె అన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్నీ గడపగడపకూ అందిస్తూ పారదర్శకంగా వలంటీర్లు సేవ చేస్తున్న విషయం టీడీపీ నాయకులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రజలంతా వలంటీర్లకు నీరాజనాలు పలుకుతుండగా టీడీపీ, జనసేన నాయకులు అది చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. వలంటీర్లపై లేనిపోని అసత్య ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదని మంత్రి వనిత అన్నారు. మహిళను అక్రమంగా రవాణా చేస్తున్నారని, ఆడవాళ్లని అమ్మేస్తున్నారంటూ కేంద్ర నిఘా వర్గాలు చెప్పాయని పవన్ కల్యాణ్ అనడం మహిళలను కించపరచడమేనని ఆమె చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వలంటీర్లకు టీడీపీ నాయకులు క్షమాపణ చెప్పాలని, తమ వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని మంత్రి వనిత డిమాండ్ చేశారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు: ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు: తెలుగుదేశం పార్టీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి వలంటీర్లని జిహాదీ టెర్రరిస్టులతో పోల్చడం సమంజసం కాదని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు సంక్షేమ పథకాలు చేరవేయడం, ఇంటింటికీ వెళ్లి పింఛను అందించడంలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తలుగా వలంటీర్లు వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న టీడీపీ శ్రేణులు వలంటీర్లపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. కరోనా వంటి విపత్తు సమయంలో వలంటీర్లు అందించిన సేవలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని తలారి గుర్తు చేశారు. వలంటీర్లపై నోటికి వచ్చినట్టు పవన్ కల్యాణ్, లోకేష్‌లతో పాటు సుధీర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా చక్కని రీతిలో వలంటీర్ వ్యవస్థ పని చేస్తుంటే ఓర్వలేక సుధీర్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు. తక్షణమే సుధీర్‌రెడ్డి వలంటీర్లకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే తలారి డిమాండ్ చేశారు.

ఓటేసి మళ్లీ గెలిపించుకుందాం

- వైఎస్సార్ సీపీ నాయకులు
- 17వ వార్డులో ఇంటింటి ప్రచారం



సుబ్బరాజుపేటలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న కౌన్సిలర్లు, పార్టీ నాయకులు

నిడదవోలు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, జేఏసీ కన్వీనర్ షేక్ ఛాన్‌బాషా, పార్టీ పట్టణ శాఖ కార్యదర్శి గాజుల రంగారావు అన్నారు. పట్టణంలోని 17వ వార్డు సుబ్బరాజుపేటలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, పట్టణంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలకాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధితో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేయాలని నాయకులు కోరారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పిట్టా పద్మావతి, సైదు చంద్రశేఖర్, దిరిసిన రామచంద్రరావు, ఆరుగొల్లు వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, పార్టీ నాయకులు గంగుల గోపియాదవ్, తోలేటి కోటేశ్వరరావు, మద్దాల శ్రీనివాస్, కైకరపు సత్యనారాయణ, విపర్తి కిషోర్, పోతురాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడా పోటీలు



సర్టిఫికెట్లు పొందిన విజేతలైన విద్యార్థినులతో ప్రిన్సిపల్ రుద్రా

నిడదవోలు: క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రుద్ర అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆ కళాశాలలో విద్యార్థినులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ సత్యసాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

చాగల్లు: చంద్రవరం గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రాంగణంలో గ్రామస్తులు కొత్తగా శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి ఆలయాన్ని నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అగ్నిమథనం, అష్టకలశ స్థాపన, సప్తకలశ స్థాపన, నవకలశ స్థాపన, ధ్రువ మూర్తులకు పంచగవ్యాధివాసం, జలాదివాసం, సర్వదేవతా ఆవాహనం, మహాశాంతి హోమం వంటి పూజలు నిర్వహించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, ప్రథమారాధన, పీఠారోహణ, కళావాహనం పూజలు, అన్నసమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

నేడు 20వ వార్డులో వైఎస్సార్ సీపీ ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రజాశీర్వాదం పేరుతో పట్టణంలోని 20వ వార్డులో బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఇంటింటి ప్రచారం చేపట్టనున్నారు. కావున నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ కమిటీల్లో వివిధ హోదాల్లో నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు కోరారు.

తలారికి మద్దతుగా ఇంటింటి ప్రచారం



తలారి వెంకట్రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కుమార్తె షాలిని తదితరులు

తాళ్లపూడి: పేదల జీవితాలు మెరుగు పడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు కుమార్తె షాలిని అన్నారు. తలారి కుమార్తె షాలిని, అక్క పొట్టి స్వర్ణలత, చెల్లెలు చిన్నం సుజాత తదితరులు మండలంలోని అన్నదేవరపేటలో మంగళవారం రెండో రోజు కూడా తలారికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్న తలారి వెంకట్రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ పిట్టా శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు పి.నాని, నాయకులు మెట్టి బ్రదర్స్, నూతంగి సురేష్, ఎలిపే రాజు, మెట్టి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పోలీసు కవాతు



పెరవలి మండలం అన్నవరప్పాడులో పోలీసు కవాతు

నిడదవోలు రూరల్: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పురుషోత్తపల్లి, విజ్జేశ్వరం గ్రామాల్లో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు కేంద్ర సాయుధ బలగాలతో మార్చ్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్ఎస్‌వీవీ రమేష్, ఏఎస్సై పరమహంస, పోలీసులు, పారా మిలటరీ బలగాలు పాల్గొన్నాయి.

నిర్భయంగా ఓటేయండి

పెరవలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక ఎస్ఐ ఏపీఎస్ మూర్తి సూచించారు. మండలంలోని అన్నవరప్పాడు, ఖండవల్లి, ముక్కామల గ్రామాల్లో పోలీసులు మంగళవారం పారా మిలిటరీ దళాలతో కలసి కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే ఈ కవాతు ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఎస్సై అన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే నిర్భయంగా తమకు సమాచారం ఇవ్వాలని మూర్తి కోరారు. మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని ఆయన చెప్పారు. ఈ గ్రామాల్లో నిత్యం పోలీసు పర్యవేక్షణ ఉంటుందన్నారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: ఓటు హక్కు చాలా విలువైనదని చాగల్లు ఎస్సై పి.నాగరాజు అన్నారు. ఓటుహక్కు వినియోగంపై మంగళవారం మీనానగరం, చాగల్లు, ఊనగట్ల, నందిగంపాడు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనవ్వకూడదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో గొడవలు పడవద్దన్నారు. ఆయా గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



యర్నగూడెంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గ్రామంలోని అలివేలు మంగ, పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం రాత్రి కనుల పండువగా జరిగాయి. కొత్తగా నిర్మించిన శ్రీవారి ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. టీటీడీ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితుల ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి వారి కల్యాణం జరిపించారు. అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు గాను, కల్యాణ వేంకటేశ్వరస్వామి వారిని పెండ్లి కుమారుడిగాను అలంకరించి, గోవింద నామ స్మరణలతో పండితులు కల్యాణ వేదికపైకి తీసుకువచ్చారు. అనంతరం కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయ నిర్మాణ ప్రధాన దాత శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం, రోహిణి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు కల్యాణ అక్షతలు, ప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు కాశీవిశ్వనాథం, రోహిణి దంపతులను ఘనంగా సన్మానించారు. అశేషంగా భక్తులు తరలి వచ్చి స్వామి వారి కల్యాణ వేడుకను తిలకించారు.

సేంద్రియ వరి పంట నమూనాల పరిశీలన



అనంతపల్లి సహకార సంఘ కార్యాలయం వద్ద రైతులతో వ్యవసాయాధికారులు

నల్లజర్ల: మేలైన యాజమాన్య పద్ధతులతో మండలంలోని అనంతపల్లి గ్రామంలో సాగు చేసిన వరి పంట నమూనాలను రాష్ట్రస్థాయి సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అధికారి పి.వెంకట్రావు మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని వరి పొలంబడి క్షేత్రాలను ఆయన సందర్శించిన రైతులు అనుసరిస్తున్న నాణ్యతా ప్రమాణాలు, వాడిన ఎరువులు, పురుగు మందులు, వారు అవలంభిస్తున్న వ్యక్తిగత సంరక్షణ విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే వన్యమృగ సంరక్షణ విధానాలు, కూలీల సంరక్షణ, ఆపద విధివిధానాలు, పర్యావరణ పరిరక్షణ, రైతు కూలీల సంక్షేమ విధి విధానాల గురించి రైతులను వాకబు చేశారు. మేలైన యాజమాన్య పద్ధతిలో పండించిన వరిపంటను పరిశీలించారు. వారి పంట నమూనాలను సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారి జయరామలక్ష్మి, కార్యక్రమం కో–ఆర్డినేటర్, రాజమహేంద్రవరం వ్యవసాయాధికారి ఎ.భీమరాజు, ఇంటర్నల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాబాబు, వ్యవసాయ సహాయకులు దుర్గా సురేష్, సుధీర్, జాన్‌పాల్, ఏఈఓ పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

పురుగు మందుల అవశేషాలు లేవు

గత ఖరీఫ్ సీజన్‌లో అనంతపల్లి గ్రామ రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి, పండించిన వరి పంటకు ఇండ్‌గ్యాప్ స్కోర్ సర్టిఫికెట్ లభించింది. ప్రభుత్వం వారి పంటను ల్యాబ్‌లో పరిశీలించాక, అందులో ఏవిధమైన పురుగు మందుల అవశేషాలు లేవని ధ్రువీకరించింది. ఈ ధ్రువీకరణ 2025 జూలై వరకూ చెల్లుబాటు అవుతుంది. ఈ ధ్రువీకరణతో అనంతపల్లిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులంతా తమ పంట ఉత్పత్తులను 127 దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉందని ఈ బృందం తెలిపింది. అయితే ఈ రబీ సీజన్‌లో కేవలం ఆరుగురు రైతులు మాత్రమే ఈ విధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వచ్చే ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులను ఈ ధ్రువీకరణ కిందకు తీసుకువచ్చి రైతులకు మరింత మేలు జరిగేలా చేస్తామని ఏవో కమల్‌రాజ్ తెలిపారు. గోదావరి ఆయిల్ పామ్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా రైతులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆ కంపెనీ ప్రతినిధులు భానుప్రతాప్, సురేష్, అన్నవరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.